# జడ్జిమెంట్

— ఆర్. పార్వతి

దక్ష యజ్ఞం ధ్వంసం చేస్తున్న వీరభద్రుడి హుంకారంలా వినబడింది ఉరుము తిరుగులేని నియంతలా. ప్రపంచాన్ని ఆక్రమించిన నిశీధి కడుపును చీలుస్తూ తళుక్కున మెరిసిందో మెరుపు కన్నె. ఆ కన్నియను పిడికిట బంధించాలని బయలుదేరిన పిడుగు దేవర ఆ ప్రయత్నంలో విఫలమై హాహాకారాలు చేస్తూ ఉత్తర దిక్కుగా ఎక్కడో భూమి ఒడిని చేరుకున్నాడు.

తల నరకబడ్డ మొండెం నుండి ధారగా కారుతున్న రక్తంలా కురుస్తుంది వర్షం. ముందు ఏముందో కనిపించడం చాలా కష్టంగా వుంది. చంద్రం కారు చాలా జాగ్రత్తగా నడుపుతున్నాడు. అయినా కారు ఒక గోతిలో దిగబడిపోయింది. నేను ఆందోళనగా కారులో మిగిలిన వారివైపు చూసాను. అన్నయ్య కూడా నాలానే ఆందోళనగా వున్నాడు. చంద్రం కారు బయటకు లాగాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు.

వాళ్ళిద్దరూ ముందు సీట్లో కూర్చున్నారు. నేను మున్నీ వెనక కూర్చున్నాము.

మున్నీవైపు చూసాను. జరిగేదానితో తనకేం సంబంధం లేనట్లు కళ్ళు మూసుకుని వెనకకు వాలి కూర్చుంది. అదిగో...ఆ నిర్లక్ష్యమే నాకు చికాకు కలిగిస్తుంది. దీనికి వాళ్ళ నాన్న పోలిక వచ్చింది. ఆయన కూడా అంతే. ప్రతి విషయంలోను తనకూ, ప్రపంచానికి సంబంధం లేనట్లు వుండేవారు. అలాగే ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయారు. అప్పటి నుండి నా ప్రాణాలన్నీ దీనిపైనే పెట్టుకుని బ్రతుకుతుంటే ఇది ఇలా తయారయ్యింది.

దూరంగా వర్షపు ధారల మధ్య సన్నని వెలుగు కనిపించింది. అది మెల్లిగా మా వైపు రాసాగింది.

"ఎవరది?" అన్నయ్య గొంతు చించుకుని అరిచాడు.

సమాధానంగా ముందు దగ్గు వినబడింది. ఆ తర్వాత ఒక ముసలి వాడి ఆకారం మా కళ్ళకు కనబడింది. నీరుకావి పంచె కట్టుకున్నాడు. అంత చలిలోనూ పైన ఎటువంటి ఆచ్ఛాదన లేదు. ఒక చేతిలో తాటాకుల గొడుగు, మరో చేతిలో హరికెన్ లాంతరు పట్టుకున్నాడు.

"కొంచెం కారు తోస్తావా?" అన్నయ్య అడిగాడు.

"ఈ వర్షంలో ముందుకు వెళ్ళడం కష్టమయ్యా. దారి బాగోదు. ఇంకో ఇరవై మైళ్ళు వెడితేగాని పట్నం రాదు. ఈ ప్రక్కనే నా గుడిసె వుంది. రండి. తెల్లవారాక వెడుదురుగాని" ఆ తాత గట్టిగా అరిచి చెప్పాడు.

ఆ బీభత్సమైన ప్రకృతిలో ఒకరి మాట ఒకరికి వినబడటం చాలా కష్టంగా వుంది. అటువంటి చోట పరాయి ఇంట్లో వుండటానికి అన్నయ్య సుతరామూ ఇష్టపడడు. కాని మా అందరికంటె ముందుగా మున్నీ రియాక్ట్ అయ్యింది. కారు డోర్ తెరుచుకుని క్రిందకు దిగింది. ఇక మాకు తప్పలేదు. నాకు అన్నయ్య ముఖం చూడటానికే సిగ్గుగా వుంది. మున్నీ ఎప్పుడూ అన్నయ్య మాట వినదు. అసలు లెక్కలేనట్లు ప్రవర్తిస్తుంది.



అది చాలా చిన్న తాటాకిల్లు. అయినా దానినే రెండు గదులుగా విభజించారు. ఆ రెండు గదులకు మధ్య తడిక అడ్డం వుంది. డ్రైవర్ చంద్రం కారులోనే వుండిపోయాడు.

"అయ్య. ఇది నా మనవరాలు మావుళ్ళు. ఇక్కడ మేం ఇద్దరమే వుంటున్నామండీ" చెప్పాడు తాత.

"ఏం చేస్తారు మీరు?" అన్నయ్య అడిగాడు.

"పాములు పట్టుకుంటామండి"

అన్నయ్య ముఖంలో అదోరకమైన అసహ్యం

ప్రత్యక్ష మయ్యింది. తనతోపాటు తెచ్చిన దుప్పటి నేలపై పరిచి కూర్చున్నాడు.

"ఈ అమ్మాయి కూడా పాములు పడుతుందా?" మున్నీ కుతూహలంగా అడిగింది.

వచ్చిన దగ్గర నుండి మున్నీ వేసిన పంజాబీ డ్రస్సును ఆసక్తిగా చూస్తున్న మావుళ్ళు ముఖంలో సిగ్గు తొంగిచూసింది.

"పడుతుందండి. పెళ్ళయ్యే దాకా దానికి కూడా ఈ బాధలు తప్పవండి."

"కబుర్లు చాలు. పడుకోండి. ప్రొద్దుటే ప్రయాణం" అటు తిరిగి పడుకుంటూ అన్నయ్య చెప్పాడు.

నేను, అన్నయ్య, మున్నీ ఆ గదిలోనే పడుకున్నాము. మా వుళ్ళు ముందు గదిలో పడుకుంది. తాత కారు దగ్గరకు వెళ్ళిపోయాడు. బయట వర్షం అలా కురుస్తూనే వుంది.


ఆయన పోయేనాటికి మున్నీకి పదేళ్ళు. ఇంత ఆస్తిని, ఈ ఆడపిల్లని పెంచడంలో అన్నయ్య నాకు చాలా సాయపడ్డాడు. అన్నయ్యది నిప్పులు కూడా కడిగే మనస్తత్వం. చాలా ఆచారంగా వుంటాడు. మున్నీని కాలేజీకి పంపడం కూడా తనకు ఏమాత్రం ఇష్టం లేదు. అయినా మున్నీ ఏడ్చి, అన్నం తినకుండా కూర్చుంటే అన్నయ్యను బ్రతిమాలి నేనే ఒప్పించాను. ఇది కాలేజి వెళ్ళి కాలేజి పాఠాలతోపాటు ప్రేమ పాఠాలు కూడా నేర్చుకుంది.

వినోద్ అనే కుర్రాడిని ప్రేమించానని, అతనినే పెళ్ళి చేసుకుంటానని కూర్చుంది. ఆ వినోద్ గురించి వాకబు చేయించాను. అతను బ్యాంకులో పనిచేస్తున్నాడు. కుర్రాడు అందగాడు, మంచివాడేకాని ఏం లాభం? అతను ఒక అనాథ. అనాథ శరణాలయంలో పెరిగాడు. కుల గోత్రాలు తెలీనివాడు.

అన్నయ్యకు చెప్పాను. మండిపడ్డాడు. వెంటనే ఏదో పెళ్ళి సంబంధం చూసాడు. అసలు అన్నయ్యకు ఒక కొడుకు వుంటే సమస్య లేకపోను. ఇప్పుడు చూసిన సంబంధం దాదాపు ఖాయమయినట్లే. తాంబూలాలు తీసుకోవడానికి అన్నయ్య ఇంటికి వెడుతూ ఇక్కడ చిక్కుపడి పోయాము.

ఆలోచనల మధ్య ఎప్పుడో నిద్ర పట్టింది.

ఏదో చప్పుడై హఠాత్తుగా మెలుకువ వచ్చింది. తడిక అవతల మాటలు వినిపిస్తున్నాయి. వెళ్ళి చూసాను. అన్నయ్య మావుళ్ళుతో ఏదో మాట్లా




డుతున్నాడు.

"ఎంత పొగరే నీకు. నన్నే కొడతావా?" ఆవేశంగా అడిగాడు అన్నయ్య.

"ఆడదాన్ని కాబట్టి అంతకన్నా ఏం చెయ్యలేను బాబు. నీవు చేసిన పనికి నిన్ను నరికి పోగులు పెట్టాలి."

"అంత టెక్కు చెయ్యకు. పాములు పట్టేదానివి. ఎంత డబ్బు కావాలో అడుగు పారేస్తాను."

"అక్కర్లేదు సామి. నీ డబ్బుకు నీకు ఒక దండం. బయటకు నడు. అర్ధరాత్రి ఆడవాళ్ళతో ఇబ్బందిపడుతున్నారని ఆశ్రయం ఇస్తే నీ కుక్కబుద్ధి బయట పెట్టుకున్నావు. అంత ఆగలేకపోతే ఆ గదిలో నీ చెల్లెలి కూతురుందిగా. వెళ్ళి మీదపడు" అన్నయ్య ఏం మాట్లాడలేదు. వెనక్కు తిరిగాడు. నేను వెళ్లి మున్నీ పక్కన పడుకున్నాను.

అయితే అన్నయ్య లోనికి రాలేదు. బయటకు వెళ్ళిపోయి వుంటాడు.

నాకు తెలీకుండానే నా కళ్ళ వెంబడి నీళ్ళు వస్తున్నాయి. నీతి నియమాలు మనిషికి అవసరం అనుకుంటే అవి ఆడకైనా మగకైనా ఒకటేగా మరి...

బాణం దెబ్బ తగిలిన పావురంలా, పాము నోటికి చిక్కిన కప్పలా నా మనస్సు విలవిల్లాడుతుంది.

"అమ్మా! ఎందుకు ఏడుస్తున్నావ్?" మున్నీ అడిగింది.

"ఎంతసేపయ్యింది లేచి?" అడిగాను.

"ఇప్పుడే. నీవు ఏడుస్తుంటే మెలకువ వచ్చింది" చెప్పింది.

"ఒక్క మాట అడుగుతాను చెబుతావా?"

"ఇప్పుడే చెప్పాలా?"

"ఊ"

"అయితే అడుగు" నాపై చెయ్యివేసి దగ్గరగా జరుగుతూ అంది మున్నీ.

"నిజంగా నీవు వినోద్‌ని ప్రేమించావా?"

"నీకు ఎందుకు వచ్చిందా సందేహం?"

నేను సమాధానం చెప్పలేదు. మున్నీ చెప్పింది.

"ఈ పెళ్ళికి ఎలా ఒప్పుకున్నాననేగా? నాన్న పోయిన దగ్గర నుండి కళ్ళలో పెట్టుకు పెంచావు. నీ మనస్సు నొప్పించి నా దారి నే చూసుకుంటానని ఎలా అనుకున్నావ్?"

నేనేం మాట్లాడలేదు. ఏం చెయ్యాలో నేను అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేసాను.

"మున్నీ. నీ పెళ్ళి నీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది" చెప్పాను.

* * *

తెలతెలవారుతుండగా అందరం బయలుదేరాం. అన్నయ్య ముఖం అప్రసన్నంగా వుంది. అయినా నేను లెక్క చేయలేదు. వెళ్ళి కారులో కూర్చున్నాను. చంద్రం కారు రివర్సు చేస్తున్నాడు. నేలంతా బురదగా వుంది. రాత్రి తుఫాన్‌కి చెట్లు విరిగిపోయి దారి బీభత్సంగా వుంది. ఎక్కడో తన గూటిని, పిల్లలను తిరిగి చేరుకున్న పక్షి సంతోషంగా అరుస్తుంది.

"చంద్రం ఒకసారి కారు ఆపు" మున్నీ అరిచింది.

తన బ్యాగు నుండి రెండు పంజాబి డ్రస్సులు తీసి మావుళ్ళు దగ్గరకు పరిగెత్తింది మున్నీ. ముందు వద్దన్నా తర్వాత తీసుకుంది మావుళ్ళు. మా కారు వెడుతుంటే వెనక నుండి ఆ తాత మనవరాలు చేతులు చూపుతున్నారు.

●